సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా



మృతుడు కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న అక్కరమాని వెంకటరావు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్ దరి సుందర్‌నగర్‌కు చెందిన చెల్లూరి శ్రీనివాసరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వైఎస్సార్ బీమా ఆయనకు వర్తించింది. ఈ మేరకు బీమా పథకం కింద రూ.5 లక్షలు మంజూరైంది. సంబంధిత 25వ నంబరు సచివాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, స్థానిక నాయకులు సచివాలయం సిబ్బందితో కలసి బుధవారం మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు, స్థానిక నాయకులు వైదా నారాయణరావు, ఒమ్మి శ్రీను, కన్నబాబు, చలం, రజని, శ్రీను, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: పైనాపిల్ కాలనీలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనుండడంతో గురువారం పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. పైనాపిల్ కాలనీలో 33/11 కేవీ పరిధిలో 11 కేవీ ఫీడర్ మరమ్మతులు జరగనుండడంతో స్థానిక జీఎస్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, సీపీడీ కార్యాలయం, పైనాపిల్ కాలనీ, దారపాలెంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీసులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సీఐ రామారావు

ఎంవీపీ కాలనీ: వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. త్రీటౌన్, ద్వారక, ఎంవీపీ కాలనీ పోలీసులకు ఈ వైద్య పరీక్షలు త్రీటౌన్ పోలీసు స్టేషన్ ప్రాంగణంలో చేశారు. త్రీటౌన్ సీఐ రామారావు, ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు, ద్వారక ట్రాఫిక్ సీఐ కేవీఎస్ఎస్ఎన్ ప్రసాద్‌లతో పాటు ఎస్‌ఐలు, హెచ్‌సీలు, సిబ్బంది పెద్ద ఎత్తున వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్‌తో పాటు సాధారణ, ఈసీజీ, 2డీ ఏకో, కార్డియాలజీ వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీపీ కాలనీ మెడికవర్ ఆస్పత్రి హెడ్ డాక్టర్ శ్రీధర్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మనిషి జీవితంలో కామెడీ పాత్ర కీలకం



వర్కుషాపు ప్రారంభంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

ఎంవీపీకాలనీ: మనిషి జీవితంలో కామెడీ పాత్ర కీలకమని బాల వికాష్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు అన్నారు. బాల వికాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హాస్యప్రియ కామెడీ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న కామెడీ వర్క్‌షాపును బుధవారం ఆయన ప్రారంభించారు. కామెడీని ఆస్వాదించడం ద్వారా మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. హాస్యప్రియ కామెడీ క్లబ్ కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ అందరికీ మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం కల్పించే లక్ష్యంతో ఈ వర్క్‌షాపు ద్వారా కామెడీ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఎంవీపీకాలనీలోని వీఎంసీ కళాశాలలో జరుగుతున్న ఈ వర్క్‌షాప్ ఈ నెల 19 వరకు కొనసాగుతుందన్నారు. తొలి రోజు వర్క్‌షాపునకు 23 మంది హాజరైనట్లు తెలిపారు.



పోటీలో భాగంగా కథ చదువుతున్న విద్యార్థి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- ఆట పాటలతో సాగుతున్న వేసవి శిబిరాలు
- చిన్నారుల్లో నూతనోత్సాహం
- సృజనాత్మకతకు పెద్ద పీట

మద్దిలపాలెం: ఈ ఏడాది వేసవి శిక్షణ శిబిరాలు ఉల్లాసంగా సాగుతున్నాయి. చిన్నారుల్లో నూతనోత్సాహం నింపుతున్నాయి. ఎండలో అల్లరి చిల్లరిగా తిరగకుండా నీడపట్టున చక్కటి కథలు, నచ్చిన బొమ్మలు గీయడం, ఇండోర్ గ్రేమ్‌లలో శిక్షణ పొందుతూ స్వేద తీరుతున్నారు. సృజనాత్మకత, స్నేహబంధం, ఊహా శక్తిని పెంచడానికి వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ నగరంలో 45 ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది.

శిక్షణ శిబిరాల్లో ఇలా..

- ఇంట్లో టీవీలు, మొబైల్స్‌కు అతుక్కుపోకుండా చిన్నారుల అభిరుచులకు తగ్గట్టుగా నీతికథలు, కల్పిత కథల నుంచి వచ్చే ఊహాశక్తిని పెంపొందిస్తున్నారు.
- ప్రకృతి, సమాజం పట్ల ఆసక్తి పెంచుతూ అందుకు అనుగుణంగా చక్కని చిత్రాలు గీయడంపై తర్ఫీదు ఇస్తున్నారు.
- సమాజంలో భాగస్వామ్యం చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. - ఇంటి పనుల్లో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేలా అవగాహన కల్పిస్తున్నారు.
- ఆటలు ఆడిస్తూ స్నేహబంధంతో పాటు క్రీడా స్ఫూర్తిని నేర్పిస్తున్నారు.
- పాటలు పాడించడం, నేర్పించడం, సంగీతంలో మెలకువలపై అవగాహన కల్పించడం చేస్తున్నారు.
- ఏకపాత్రాభినయంతో చిన్నారుల్లో నటనపై ఆసక్తిని కల్పిస్తున్నారు.
- కథల పుస్తకాలు చదివించి ఆ నీతిని పిల్లలే వివరించేలా చేస్తున్నారు.
- అభిరుచుల్లో భాగంగా స్టాంప్‌లు, నాణేల సేకరణపై ప్రోత్సహిస్తున్నారు.
- ఐస్ బ్రేకింగ్ యాక్టివిటీస్, చదరంగం, చైనీస్ చెక్కర్ వంటి ఆటల్లో శిక్షణ ఇస్తున్నారు.



వేసవి శిబిరంలో ఉత్సాహంగా చిన్నారులు



తయారు చేసిన బొమ్మలతో చిన్నారులు

శిబిరాలు నిర్వహించే ప్రాంతాలు

భీమిలి, మధురవాడ, ఆరిలోవ, మద్దిలపాలెం, జగదాంబ, కంచరపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, మల్కాపురం, గాజువాక, గంట్యాడతో పాటు పలు ప్రాంతాలలో శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఈ శిబిరాలకు కన్వీనర్లుగా కొండమ్మ, కుమారి, నాగమణి, అరుణ, ఎల్లాజీ, రజని, కృష్ణారావు, లీలావతి, లక్ష్మి, అప్పారావు, తదితరులు వ్యవహరిస్తున్నారు.

ముందుగా వలంటీర్లకు శిక్షణ

వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణ కోసం ముందుగా పిఠాపురం కాలనీలో గత నెల 30న వలంటీర్లకు శిక్షణ ఇచ్చాం. వారితో జిల్లా వ్యాప్తంగా శిక్షణ శిబిరాలు దిగ్విజయంగా నడుస్తున్నాయి. మొత్తం 45 చోట్ల ఈ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశాం. వేలాది మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. రోటరీ క్లబ్, ఆసరా చారిటబుల్ ట్రస్ట్ సహాయ, సహకారాలు అందిస్తున్నాయి.

– సుశీల, సమ్మర్ క్యాంపుల నిర్వాహకురాలు, వైజాగ్ చిల్డ్రన్ క్లబ్

జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత అంటూ గ్రీన్ క్లైమేట్ టీమ్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ఓ పాఠశాల ఆవరణలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 22న అంతర్జాతీయ జీవ సంబంధాల దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ కాలుష్యం కారణంగా వాతావరణం వేడెక్కడంతో పెద్ద ఎత్తున జీవ వైవిధ్యం దెబ్బ తింటోందన్నారు. వ్యవసాయంలో వాడే రసాయనాలు, వాహన, పరిశ్రమల కాలుష్యంతో జీవ వైవిధ్యానికి పెను సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. దీంతో వేల సంఖ్యలో జీవరాశులు అంతరించిపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు.

వ్యక్తి అదృశ్యం

ఆరిలోవ: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. పదో వార్డు ఆదర్శనగర్‌లో నివాసముంటున్న బోని దుర్గారావు ఈ నెల 13న ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువులను సంప్రదించినా ఆచూకీ తెలియలేదు. అతని భార్య గంగాభవాని ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడితో సహా వివాహిత అదృశ్యం



కుమారుడితో రాజులమ్మ

ఎంవీపీ కాలనీ: కుమారుడితో సహా వివాహిత అదృశ్యమైన ఘటన ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సూరాడ రాజులమ్మ(26) భర్త సూరాడ దాసు, కుమారుడు మహేంద్రతో కలిసి ఎంవీపీ కాలనీ సెక్టార్-9 అప్పుఘర్‌లో నివాసం ఉంటోంది. ఈ నెల 14న ఉదయం కూరగాయల కొనుగోలు కోసం కుమారుడిని తీసుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజులమ్మ తిరిగి రాలేదు. దీంతో దాసు పలు ప్రాంతాల్లో వెతకడంతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులను వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో బుధవారం ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 0891-2755348 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

పబ్లిక్ డిమాండ్

శాంతినగర్‌లో వీధి దీపాలు వెలిగించండి



శాంతినగర్‌లో లైటు వెలగని విద్యుత్ స్తంభం

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పరిధి రవీంద్రనగర్ సమీప శాంతినగర్‌లో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. ఇక్కడ 25 విద్యుత్ స్తంభాలున్నాయి. ఎక్కడా దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళ అంధకారంగా ఉంటోంది. అధికారులు స్పందించి కాలనీలో వీధి దీపాలు వెలిగించాలని కోరుతున్నాం.

– ఒమ్మి శ్రీను, శాంతినగర్

వేద విద్యను పునఃప్రారంభించాలని వినతి



స్పీకర్ తమ్మినేనికి వినతిపత్రం అందజేస్తున్న శివరామ, గొందు సీతారాం

బీచ్‌రోడ్డు: పూర్వం గురుకులాలు, విశ్వ విద్యాలయాల్లో వేదాలు, వాస్తు, జ్యోతిష్య శాస్త్రం విద్యను బోధించేవారని, మళ్లీ ఆ విద్యను పునఃప్రారంభించి భావితరాలకు అందించాలని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు వాస్తు జ్యోతిష్య పండితుడు లక్కోజు శివరామ కోరారు. నగరానికి వచ్చిన స్పీకర్‌ను బుధవారం ప్రభుత్వ అతిథిగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో చాలా మంది విద్యార్థులు జ్యోతిష్య శాస్త్రం చదివేందుకు ఆసక్తి చూపిస్తున్నారని అందులో పేర్కొన్నారు.

బాలల హక్కుల కమిషన్ మరింత చేరువ కావాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పిల్లలకు మరింత చేరువ కావాలని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. నగర పర్యటనకు వచ్చిన ఆయన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొందు సీతారాం కలిశారు. ఏడాది కాలంగా కమిషన్ చేపట్టిన కార్యక్రమాల నివేదికను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ దేశంలో ఇతర రాష్ట్రాల బాలల హక్కుల కమిషన్‌కు దీటుగా మన రాష్ట్ర కమిషన్ పనిచేయాలన్నారు. గొందు సీతారాం మాట్లాడుతూ కమిషన్ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించినట్లు చెప్పారు.

కార్మికుల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి



నూతన వాహనాలతో మేయర్ హరివెంకటకుమారి, అధికారులు

తాటిచెట్లపాలెం: జోన్-5 పరిధిలోని పారిశుధ్య కార్మికుల కోసం నూతనంగా సమకూర్చిన వాహనాలను బుధవారం తాటిచెట్లపాలెంలోని మినీ సూయేజ్ ఫాం-5లో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ) సహకారంతో నమస్తే స్కీం ద్వారా పారిశుధ్య కార్మికులకు రాయితీపై రెండు పొక్లెయిన్లు, ఒక సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాన్ని అందజేసినట్లు చెప్పారు. వాహనాల రాయితీని ఏడేళ్ల పాటు జీవీఎంసీ చెల్లిస్తుందని, దీని ద్వారా పారిశుధ్య కార్మికుడికే లబ్ధి చేకూరుతుందన్నారు. తద్వారా కార్మికులు ఆర్థికంగా బలోపేతమవుతారని మేయర్ తెలిపారు. ఐదుగురు పారిశుధ్య కార్మికులు గ్రూపుగా ఏర్పడి ఒక్కో వాహన నిర్వహణ బాధ్యతను చూసుకుంటారని, ప్రధాన గెడ్డల్లో పూడికలు తీసేందుకు వీటిని వినియోగిస్తామని తెలిపారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 84పై అవగాహన

మురళీనగర్(విశాఖ ఉత్తర): నగరంలోని యూఎల్‌సీ భూముల్లో భవనాలు నిర్మించుకుని నివసిస్తున్న వారితో పాటు ఖాళీ స్థలాల్లో డీ పట్టాల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 84పై ఆర్డీవో హుస్సేన్ అవగాహన కల్పించారు. 49, 50 వార్డులకు సంబంధించి సత్యనగర్-1లో స్థానికులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలిపల్లి ప్రసాద్ సమక్షంలో ఆయన స్థానికులకు వివరాలు తెలియజేశారు. 150 గజాల వరకు డీపట్టా ఉచితంగా అందిస్తామన్నారు. 151 నుంచి మూడు 300 గజాల వరకు మార్కెట్ విలువపై 15 శాతం, 301 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 దాటితే వంద శాతం మార్కెట్ విలువ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి సర్వే జరుగుతుందని తెలిపారు.

సలీం నవలలు సమాజ దర్పణాలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: పౌర గ్రంథాలయంలో సహృదయ సాహితీ ఆధ్వర్యంలో బుధవారం ప్రముఖ రచయిత సలీం రచించిన 'రెండు ఆకాశాల మధ్య'పుస్తక పరిచయ సభ జరిగింది. సభాధ్యక్షుడు సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సలీం నవలలు సమాజ దర్పణాలు అని కొనియాడారు. సలీం రచించిన 29 నవలల్లో కాలుతున్న పూలతోటకి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని గుర్తు చేశారు. రెండు ఆకాశాల మధ్య నవలలో భారత్, పాకిస్తాన్ సరిహద్దు గ్రామాల ప్రజల దుర్భర జీవితాలను హృద్యంగా, సజీవంగా తనదైన శైలిలో పొందుపర్చారన్నారు. అనంతరం పుస్తకాన్ని అతిథులతో కలిసి ఆవిష్కరించారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ దేశ విభజన సమ యంలో జరిగిన దారుణమైన నరమేధాన్ని చిత్రీకరించిన గొప్ప నవలగా అభివర్ణించారు. ప్రముఖ రచయిత ఎల్.ఆర్.స్వామి మాట్లాడుతూ సలీం రచనలు అందరినీ చదివింపజేస్తాయని, అనేక ఇతర భాషల్లో అనువదించారన్నారు. రచయిత ఆదూరి వెంకట సీతారామమూర్తి, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి, డి.వి.సూర్యారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు పాల్గొన్నారు.



మృతి చెందిన యువకుడు విజ్జు

భవనం పైనుంచి పడి యువకుడి మృతి

ఎంవీపీకాలనీ: మద్యం మత్తులో భవనంపై నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఒడిశాకు చెందిన విజ్జు (26) నగరంలోని ఓ హోటల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన పలువురు యువకులతో కలిసి ఎంవీపీకాలనీ సెక్టార్-9లోని ఓ ఇంట్లోని రెండవ అంతస్తులో అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం పనికి వెళ్లని విజ్జు మధ్యాహ్నం నుంచి మద్యం తాగుతూ ఉన్నాడు. మంగళవారం అర్ధరాత్రి మద్యం మత్తులో బయటకు వచ్చిన విజ్జు.. అదుపు తప్పి రెండో అంతస్తు నుంచి కింద పడిపోయాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని తోటి యువకులు పోలీసులకు సమాచారం అందించడంతో.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్లవేళలా పరిశుభ్రంగా వార్డులు

- యుద్ధప్రాతిపదికన వ్యర్థాల తరలింపు
- జెడ్సీలకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



పీ అండ్ టీ కాలనీలో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతమ్మధార: వార్డుల్లో చెత్త కుప్పల నిల్వలు లేకుండా యుద్ధప్రాతిపదికన డంపింగ్ యార్డుకు తరలించాలని జోనల్ కమిషనర్లను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. సీతమ్మధార, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులోని డంపర్ బిన్ల చుట్టూ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలన్నారు. డోర్ టూ డోర్ చెత్త సేకరిస్తున్నప్పుడు డస్ట్ బిన్లలోకి ఎలా చేరుతోందని ఆరా తీశారు. పారిశుధ్య కార్యక్రమాల్లో పుష్ కార్ట్ ద్వారా చెత్తను నేరుగా క్లాప్ వాహనానికి అందించేలా చూడాలని సూచించారు. సచివాలయం పరిధిలో శానిటరీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వార్డులో వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. సీన్ పాయింట్ వారీగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేసుకొని రోడ్లు, కాలువలను శుభ్రపరచాలని సూచించారు. స్థానిక మయూరి కల్యాణ మండపం పక్క వీధిలో చెత్త ఎక్కువగా పేరుకుపోవడంతో దానిని వెంటనే పారిశుధ్య కార్మికులచే ఎత్తించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని ఆదేశించారు. అక్కయ్యపాలెం–దొండపర్తి ప్రధాన రహదారిని ఉదయం 6 గంటల నుంచి కార్మికులచే శుభ్రం చేయించాలని కమిషనర్ ఆదేశించారు. బీచ్ రోడ్డులోని సాగర్‌నగర్, రుషికొండ వరకు పర్యటించి జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ పనులు ఏవిధంగా చేస్తే బాగుంటుందని పరిశీలించారు. సాగర్‌నగర్‌లో మరుగుదొడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పర్యటనలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీర్లు రవికృష్ణరాజు, చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీర్ కె.వి.ఎస్.రవి, కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో బల్క్ విక్రయాలు సరికాదు

- మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్
- పెదవాల్తేరు రైతుబజార్‌లో తనిఖీలు



గృహమిత్ర దుకాణదారుడితో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్

ఏయూ క్యాంపస్: రైతుబజార్‌లో బల్క్ విక్రయాలు సరికాదని మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్ సూచించారు. పెదవాల్తేరులోని రైతుబజార్‌ను బుధవారం ఉదయం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు స్టాళ్లలో విక్రయిస్తున్న వస్తువులు, దుకాణాల నిర్వహణ వంటివి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సమయంలో బల్క్‌గా టమాటాలు విక్రయించడం కొంతమంది వినియోగదారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సదరు డ్వాక్రా మహిళలను పిలిచి మాట్లాడారు. ఉదయం వేళలో బల్క్ విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా గృహమిత్ర దుకాణదారుడు నిర్దేశించిన స్థలం కంటే ముందుకు వచ్చి వినియోగించడం, రహదారికి అడ్డుగా వస్తువులు ఉండడం ఆయన దృష్టికి వచ్చింది. నిర్దేశించిన స్థలంలో మాత్రమే దుకాణం నడపాలని దుకాణదారుడికి ఏడీ స్పష్టం చేశారు. అవసరమైతే అద్దె పెంచాలని, తాను మాత్రం ప్రస్తుతం ఉన్న విధంగానే దుకాణం నడుపుతానని సదరు గృహమిత్ర దుకాణదారుడు ఏడీకి స్పష్టం చేశారు. దుకాణదారుడి మాటతో నిశ్చేష్టులైన ఏడీ వెంటనే స్పందించి రహదారిలోకి దుకాణం విస్తరించి నడపడం సరికాదని, వెంటనే దానిని తొలగించాలని సూచించారు. అదే విధంగా అనుమతించిన వస్తువులు మాత్రమే విక్రయించాలని చెప్పారు.

సాయంత్ర వేళలలో..

రైతుబజార్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో వేర్వేరు రైతులను ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఎస్టేట్ ఆఫీసర్ వరలక్ష్మికి సూచించారు. సాయంత్రం వేళల్లో పూర్తి స్థాయిలో కూరగాయలు అందుబాటులో ఉండటం లేదనే విషయం ఆయన దృష్టికి వచ్చింది. వెంటనే ప్రయోగాత్మకంగా 10 మంది రైతులను కేవలం సాయంత్రం వేళలో విక్రయాలు జరిపేలా కేటాయించాలని సూచించారు.

'జూన్ 30కి పూర్తి చేయండి'

సీతమ్మధార: భవనాలు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకాల(బీపీఎస్, ఎల్ఆర్ఎస్) పెండింగ్ దరఖాస్తులను జూన్ 30 నాటికి పూర్తి చేయాలని జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆశీలమెట్టలోని జోన్-3 కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయపై ప్రభుత్వం ఆఖరి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. టీపీవో వినయ్‌ప్రసాద్, టీపీఎస్ తేజ, టీపీబీవో అనిత, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.